క్లుప్తంగా

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు షురూ

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో గురువారం ఉదయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర సీపీ అంబర్ కిశోర్ ఝా దేవాలయాన్ని సందర్శించి రుద్రేశ్వరీ రుద్రేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల ఎదుట జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా గంగు ఉపేంద్రశర్మ, ఈఓ వెంకటయ్య వారిని పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు.

షెడ్డు నిర్మాణం తొలగింపు

వరంగల్ అర్బన్: ఓ వ్యక్తి హనుమకొండ బాలసముద్రం హరిత రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లోని సెల్లార్‌లో కాకుండా.. పిల్లలకు సంబంధించిన ఆటస్థలంలో అక్రమంగా కారు పార్కింగ్ షెడ్డు నిర్మించాడు. అనధికారిక షెడ్డు నిర్మాణంపై తాజాగా వరంగల్ కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్యకు ఫిర్యాదు అందింది. దీంతో బల్దియా బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బంది గురువారం తొలగించేందుకు యత్నించగా.. సదరు నిర్మాణదారుడు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఆర్ఎఫ్ సిబ్బంది 100 డయల్‌ను ఆశ్రయించగా పోలీసులు చొరవ తీసుకుని సమస్యను సద్దుమణిగేలా చేశారు.

అపరిచితులతో జాగ్రత్త

హన్మకొండ: బాలల అక్రమ రవాణా దేశంలో ఎక్కువగా జరుగుతున్నందున పిల్లలు బాధ్యతలు ఎరిగి అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సీడబ్ల్యూసీ హనుమకొండ జిల్లా చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు సూచించారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ క్లబ్ సభ్యులు, చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్లకు బాలల హక్కులు, బాలల చట్టాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.సంతోష్ కుమార్, ముఖ్య రిసోర్స్ పర్సన్ జన్ను క్రాంతి, సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ, ప్రాజెక్టు అధికారి ఎర్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖలోని అక్రమాలపై ఫిర్యాదు

వరంగల్: వరంగల్ ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, నర్సంపేట, మహబూబాబాద్, ములుగుతోపాటు కరీంనగర్ జిల్లాల్లోని పౌరసరఫరాల గోదాముల్లో జరుగుతున్న అక్రమాలపై కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల శాఖలో ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర వినియోగదారుల మండలి అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. పౌరసరఫరాలశాఖ గోదాముల నిర్వాహకులు రైస్ మిల్లర్ల లోపాయికారి ఒప్పందాలతో వినియోగదారులకు సన్న బియ్యానికి బదులు దొడ్డు బియ్యం పంపిణీతో ఆహార భద్రతా చట్టం నిర్వీర్యం అవుతున్న విధానాలను లిఖిత పూర్వకంగా ఆశాఖ కార్యదర్శి సంజీవ్‌చోప్రాకు ఫిర్యాదు చేశామన్నారు.

బైక్‌ల సైలెన్సర్లు ధ్వంసం

వరంగల్ క్రైం: అధిక శబ్దంతో ఇబ్బంది పెడుతున్న వాహనాల సైలెన్సర్లను హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు రోలర్‌తో తొక్కించి గురువారం ధ్వంసం చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి తెలిపారు. అధిక శబ్దం చేసే 175 సైలెన్సర్లను కేయూ జంక్షన్‌లో రోడ్డుపై పెట్టి రోడ్డు రోలర్‌తో తొక్కించినట్లు వివరించారు.

నాణ్యమైన విద్యనందించాలి



హన్మకొండ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని హనుమకొండ మండల విద్యాశాఖాధికారి రాంకిషన్ రాజు అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఎలైట్ ఇంటర్ నేషనల్ స్కూల్ ఎలైట్ గ్రాండ్ గాలా కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల వికాసంలో తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. స్కూల్ చైర్మన్ మాడుగుల రాజిరెడ్డి, కరస్పాండెంట్ మాడుగుల హరితారెడ్డి, హెడుప్స్ సలహాదారుడు షణ్ముక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు అందరూ సహకరించండి

నయీంనగర్: గద్దర్ విగ్రహాన్ని హనుమకొండలో ఏర్పాటు చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ప్రొఫెసర్ కె.వెంకటనారాయణ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, రాష్ట్రం సాధించాక ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. విగ్రహ కమిటీ అధ్యక్షుడు కోండ్ర నర్సింగరావు మాట్లాడుతూ గద్దర్ విగ్రహ ఏర్పాటుకు అందరు ముందుకు రావాలని కోరారు. శ్రీనివాస్, బాబురావు, రాజేందర్, గోవర్ధన్, ప్రవీణ్, రవి, సాంబయ్య పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహేను సన్మానిస్తున్న అధ్యాపకులు



ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరవ్యాప్తంగా గురువారం ముందస్తుగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలు, బాలికలను సన్మానించారు. పురుషులతో సమానంగా అతివలు రాణించాలని పలువురు సూచించారు.

- సాక్షి నెట్‌వర్క్



కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ వర్సిటీలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు



అథ్లెట్ దీప్తిని సన్మానిస్తున్న వరంగల్ అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ, తదితరులు



దేశాయిపేటలోని ప్రభుత్వ సీకేఎం కళాశాలలో మాట్లాడుతున్న మాభూమి సంధ్య



మడికొండ దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ప్రాంగణం మేనేజర్ జయశ్రీ, తదితరులు



గోపాల్‌పూర్‌లో రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో..



మడికొండ మండల పరిషత్ పాఠశాలలో..



హసన్‌పర్తి వంగపహాడ్ పాఠశాలలో..



మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో..



కాశిబుగ్గ: మాట్లాడుతున్న నలింగటి రత్నమాల

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎంజీఎం: తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అనుబంధ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేశ్‌ఖన్నా మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావుకు అందజేశారు. యూనియన్ వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శులు గన్నారపు రమేష్, తోట భిక్షపతి, ఆర్‌బీఎస్కే డాక్టర్లు దుర్గాప్రసాద్, రవీందర్, మోహన్, అనిల్‌కుమార్, యూపీహెచ్‌సీ అసోసియేషన్ అధ్యక్షులు జన్ను కొర్నేలు, అనిల్‌కుమార్, విక్టోరియా, అభిషేక్, చంద్రకళ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఆర్వో శ్రీనివాస్

కరీమాబాద్: వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా కె.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈక్రమంలోనే కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీఆర్వోకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

రామన్నపేట: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యమని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు ఎలా వేయాలో నేర్పడంతోపాటు ఓటు విలువ గురించి తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కాజీపేట అర్బన్: విద్యార్థులు కష్టపడి చదువుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ గురువారం సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో దాగిఉన్న శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాన్ని వెలికితీసేందుకు స్మైల్ ఫౌండేషన్ కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల సైన్స్ అధికారులు శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసచారి, అజీజుద్దీన్, కిషోర్ పాల్గొన్నారు.



ప్రశంస పత్రం అందజేస్తున్న కలెక్టర్ పట్నాయక్

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

హన్మకొండ చౌరస్తా: కాజీపేటకు చెందిన నిర్మల అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల విలువగల ఎల్ఓసీని బాధిత కుటుంబానికి బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ 47వ డివిజన్ నాయకులు సిరిల్ లారెన్స్, షేక్ అజ్గర్, శ్రీకాంత్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో ఎమ్మెల్యే పూజలు

హనుమకొండ యాదవనగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

హసన్‌పర్తి: రైతులకు కాంగ్రెస్ సర్కార్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో సుమారు రూ.65లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార భవనం, గోదాంలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట వేసినప్పటి నుంచి ధాన్యం ఇంటి వచ్చే వరకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు. నలుగురు మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మర్నాడే సిద్దాపురం మాజీ సర్పంచ్ జనగాని ధనలక్ష్మి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌తో నాయకులు చేరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ముస్లింల ఉపవాస దీక్షలకు ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తన్వీర్

ఖిలా వరంగల్: పవిత్ర రంజాన్‌మాసం సందర్భంగా ముస్లింలు చేపట్టనున్న ఉపవాస దీక్షలకు అధికారులు తగిన ఏర్పాటు చేయాలని ఖిలా వరంగల్ ఈద్గా మసీదు, జానుల్లా షహీద్ కబ్రస్థాన్ కేర్‌టేకర్ మహ్మద్ అబ్దుల్ ఖాలిక్ తన్వీర్ కోరారు. ఈమేరకు ఖిలా వరంగల్ ఫోర్ట్ ఈద్గా మసీదులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హఫీజొద్దీన్, డాక్టర్ రాజమహ్మద్, నూరొద్దీన్, షఫీయొద్దీన్, మహిమూద్ పాషా, మిర్జా నసీర్ బేగ్, గౌస్, జమీల్, రబ్బాని, మౌలిత్ ఖాన్, రబ్బానీ, షేక్ తన్వీర్, ముషాహిద్ తైసీర్ తదితరులు పాల్గొన్నారు.

'తూర్పు' కాంగ్రెస్ కేడర్‌లో అసహనం



వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకుల చేరికల పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న సమాచారం లీక్ కావడంతోనే తూర్పులోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వారు పార్టీలో చేర్చుకోవద్దని కొండా మురళిని అభ్యర్థించారు. ఎన్నికల్లో సురేఖ గెలుపుకోసం పనిచేసిన వారికి గుర్తింపు తప్పకుండా ఉంటుందని, ఆయన వారికి హామీ ఇచ్చినట్లు తెలిసింది. అధిష్టానం ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ నాయకులను చేర్చుకోక తప్పలేదని తెలిసింది. బుధవారం రోజున మొదటి విడత చేరికలు పూర్తి కావడంతో గురువారం కాశిబుగ్గ తిలక్‌రోడ్‌లోని నల్గొండ రమేష్ ఇంట్లో పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు సమావేశమై వారి అసంతృప్తిని వెళ్లగక్కారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మొన్న జరిగిన ఎన్నికల్లో కొండా దంపతులను వ్యక్తిగతంగా దూషించిన కార్పొరేటర్‌ను ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. తూర్పులో నామినేటెడ్ పదవుల్లో మొదట కాంగ్రెస్‌వారికి ఇచ్చిన తరువాతనే బీఆర్ఎస్‌నుంచి వచ్చిన వారిని చూడాలని కోరారు.

ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

హసన్‌పర్తి: ఎలక్ట్రోరల్ బాండ్ల ద్వారా తన లావాదేవీలను దాచడానికి కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్.. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)ను కవచంగా వాడుకుంటోందని కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈమేరకు హసన్‌పర్తిలోని ఎస్‌బీఐ ఎదుట గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కిరణ్, వెంకటస్వామి, పెద్దమ్మ నర్సింహారాములు, వింజమూరి రమణ, జిల్లా కాంగ్రెస్ మాజీ కార్యదర్శి పున్నంచందర్, ఐలయ్య, సారంగం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





సంక్షిప్తంగా

ప్రవీణ్ కుమార్‌ను విమర్శించే హక్కు సురేఖకు లేదు

హన్మకొండ: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను విమర్శించే హక్కు మంత్రి కొండా సురేఖకు లేదని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మంద శ్యామ్ అన్నారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ వరంగల్ పశ్చిమ ఇన్‌చార్జ్ కన్నం సునీల్, వరంగల్ జిల్లా మహిళా కన్వీనర్ రాజేశ్వరి, నాయకులు మౌనిక, సుమలత, పుష్పలయ, బస్కె నాగరాజు, రాహుల్, కిశోర్, వేణుగోపాల్, నితిన్ మినాజ్, చింత సియోన్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

వరంగల్ చౌరస్తా: వరంగల్ లక్ష్మీపురం గర్ల్స్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని (సెల్ఫ్ గవర్నమెంట్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి పాఠ్యాంశాలను బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలవద్ది రాజు, అక్తర్ బేగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తి

హన్మకొండ కల్చరల్: ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. ఓరుగల్లు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హనుమకొండ హయగ్రీవచారి మైదానంతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏనుగుల రాకేష్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి పాల్గొని కార్యక్రమ వివరాలు తెలిపారు.

పల్లె దవాఖాన వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

కాశిబుగ్గ / ఎంజీఎం: రాష్ట్రంలోని పల్లె దవాఖానల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు హైదరాబాద్ కోటిలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ వీరేంద్రనాథ్, డాక్టర్ విజయ్, డాక్టర్ స్వాతి, డాక్టర్ రేణుక తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

హసన్‌పర్తి: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటోందని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. గతేడాది ప్రమాదవశాత్తు మృతిచెందిన హసన్‌పర్తి మండలం జయగిరికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోగుల భిక్షపతికి మంజూరైన రూ. 2లక్షల పార్టీ బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు రమేష్ అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, పీఏసీఎస్, సిద్దాపురం చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

జిల్లా జాయింట్ సెక్రటరీగా మహబూబ్

ఎంజీఎం: టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎండీ.మహబూబ్ ఎన్నికయ్యారు. స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో మహబూబ్‌ను ఎంపికచేయగా, ఆయనను పలువురు ఉద్యోగులు గురువారం సన్మానించారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధికి అభినందనలు

వరంగల్ లీగల్: కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమితులైన న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావును వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ తాటికొండ కృష్ణమూర్తి, న్యాయవాదులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి సహృదయ ఆహ్వాన నాటక పోటీలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ నిర్వాహణలో తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు నిర్వహించనున్నట్లు సహృదయ సంస్థ అధ్యక్షులు గిరిజా మనోహరబాబు, ప్రధాన కార్యదర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి, సాంస్కృతిక కార్యదర్శి లక్ష్మీకాంతారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాధితుడికి మొబైల్ అప్పగింత

హసన్‌పర్తి: ఆటోలో పోగొట్టుకున్న మొబైల్‌ను బాధితుడికి అందించారు. నగరానికి చెందిన నాగరాజు అనే యువకుడు గతేడాది సెప్టెంబర్‌లో మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. ఆటోలో వెళ్తుండగా ఎల్లాపురంలో మొబైల్ చోరీకి గురైందని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సీఈఐఆర్ ద్వారా ఆ మొబైల్ గుంటూరు జిల్లాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకుని బాధితుడికి స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ జె.సురేష్ గురువారం అందించారు. ఈ సందర్భంగా మొబైల్ గుర్తింపునకు కష్టపడిన కానిస్టేబుల్ క్రాంతిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

ఆల్‌ఇండియా ఇంటర్ వర్సిటీ పోటీలకు విద్యార్థి ఎంపిక

కేయూ క్యాంపస్: పంజాబ్ అమృత్‌సర్ యూనివర్సిటీలో ఈనెల 11నుంచి నిర్వహించనున్న ఆల్ ఇండియా సైక్లింగ్ పోటీలకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అభిఉద్దీన్ ఎంపికయ్యారు.



